Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi


సంపుటి :04 సంచిక : 159 పేజీలు 8 వెల : 5 మంగళవారం 16 డిసెంబర్ 2025






## 2029 ఎన్నికల్లో పోటీ చేస్తా: కవిత

హైదరాబాద్: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. 2029 ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు తెలిపారు. ఆస్క్ కవిత పేరుతో ఎక్స్ వేదికగా నెటిజన్లతో ఆమె ముచ్చటించారు. ఈ సందర్భంగా ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు ఆమె ఈ మేరకు సమాధానమిచ్చారు. పలు సామాజిక అంశాలపై పలువురు ప్రశ్నించగా.. వాటికి ఆమె సమాధానాలు చెప్పారు.



# కాంగ్రెస్.. అదే జోష్

రెండో విడతలోనూ సగానికి పైగా సర్పంచి స్థానాల్లో ఆ పార్టీ మద్దతుదారుల విజయభేరి
27 జిల్లాల్లో మెజార్టీ సీట్లు 'హస్త'గతంగట్టిపోటీ ఇచ్చి
రెండో స్థానంలో నిలిచిన ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి
నిర్మల్ జిల్లాలో భాజపాకుఅత్యధిక స్థానాలు
అర్ధరాత్రి 12.30 గంటల వరకు అందిన ఫలితాలివీ..
85.86% పోలింగ్ నమోదు

,హైదరాబాద్: రాష్ట్రంలో రెండో విడత గ్రామ పంచాయతీ సర్పంచి, వార్డు సభ్యుల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ మద్దతుదారులు విజయదుందుభి మోగించారు. మొత్తం 4,333 స్థానాల్లో సగాని కంటే ఎక్కువ గెలిచి ఆధిక్యాన్ని చాటారు. సిద్దిపేట, కుమురం భీం, జనగామ, నిర్మల్ మినహా మిగిలిన జిల్లాల్లో కాంగ్రెస్ బలపరిచిన వారే మెజారిటీ స్థానాలను కైవసం చేసుకున్నారు. ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి రెండో విడతలోనూ గట్టి పోటీ ఇచ్చి రెండో స్థానంలో నిలిచింది. స్వతంత్ర అభ్యర్థులు మూడో స్థానంలో నిలిచారు. భాజపా మద్దతుదారులకు నిర్మల్ జిల్లాలో మెజారిటీ స్థానాలు వచ్చాయి. అర్ధరాత్రి 12.30 గంటల వరకు కాంగ్రెస్ పార్టీ ఏకగ్రీవాలతో కలిపి 2,297 (51.9%), భారత రాష్ట్ర సమితి 1,191 (27.5%), భాజపా 257 (6.2%), ఇతరులు 578(14.4%) పొందారు. వీరిలో సీపీఎం మద్దతుదారులు 33 చోట్ల, సీపీఐ బలపరిచినవారు 28 చోట్ల గెలిచారు. మొదటి విడతలో కాంగ్రెస్ మద్దతుదారులు 2,425 చోట్ల, భారత రాష్ట్ర సమితి 1,168, భాజపా 189, ఇతరులు 448 చోట్ల గెలుపొందారు.ఓటెత్తిన పల్లెలు

వణికించే చలిలోనూ ఓటర్లలో ఉత్సాహం వెల్లువెత్తింది. ఉదయం నుంచే బారులు తీరారు. 85.86 శాతం పల్లె ప్రజలు ఓటు వేశారు. ఈ నెల 11న జరిగిన మొదటి విడతలో నమోదైన(84.28%) పోలింగ్ కన్నా ఇది 1.58 శాతం ఎక్కువ. ఆదివారం సెలవురోజు కావడంతో పోలింగ్ శాతం పెరిగింది. రెండో దశలో 4,333 గ్రామ పంచాయతీ సర్పంచి, 38,350 వార్డు సభ్యుల ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడింది. వీటిలో 415 గ్రామ సర్పంచి,

8,307 వార్డు పదవులు ఏకగ్రీవమయ్యాయి. మంచిర్యాల, వరంగల్ జిల్లాల్లోని ఒక్కొక్క గ్రామంలో, నల్గొండ జిల్లాలోని మూడు గ్రామాల్లో, 108 వార్డుల్లో నామినేషన్లు

దాఖలు కాలేదు. ఇంకో రెండు గ్రామాల్లో, 18 వార్డుల్లో ఎన్నికలను నిలిపివేశారు.


## భావితరాలకు ఉపయోగపడే పుస్తకం.. 'ఏ టేల్ ఆఫ్ టూ స్టేట్స్'



'ఏ టేల్ ఆఫ్ టూ స్టేట్స్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో రచయితలు ఐ.వెంకటరావు, అనురాధ, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి కె.చంద్రహాస్, ప్రచురణకర్తలు ఐ.వేణు, ఐ.రఘు

అమరావతి: ప్రముఖ పాత్రికేయుడు ఐ.వెంకటరావు రాసిన 'విలీనం-విభజన' పుస్తకం ఆంగ్ల అనువాదం 'ఏ టేల్ ఆఫ్ టూ స్టేట్స్'ను సీఎం చంద్రబాబు ఆదివారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. పరిశోధకులు, భవిష్యత్తు తరాలకు ఈ పుస్తకం ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. పుస్తకాన్ని ఆంగ్లంలోకి అనువదించిన ఎన్.అనురాధను ఆయన అభినందించారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల విలీనం, విభజన అంశాలతో పాటు తెలుగు రాష్ట్రాల్ని పరిపాలించిన సీఎంల గురించి రచయిత ఇందులో వివరించారు. రచయిత ఐ.వెంకటరావు, రచయిత, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి కె.చంద్రహాస్, పుస్తక ప్రచురణకర్తలు ఐ.వేణు, ఐ.రఘు పాల్గొన్నారు.

## మైనింగ్ రంగాన్ని అభివృద్ధి చేస్తాం: మంత్రి కొల్లు రవీంద్ర



విజయవాడ: దేశ పారిశ్రామిక అవసరాలు తీర్చడంలో ఏపీ మైనింగ్ రంగాన్ని కీలకంగా మార్చబోతున్నామని గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. విజయవాడ లబ్బీపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో నిర్వహిస్తోన్న ఏపీ ఛాంబర్స్ బిజినెస్ ఎక్స్‌పోను ఆదివారం ఆయన సందర్శించారు. మంత్రి మాట్లాడుతూ.. మైనింగ్ రంగంలో పెట్టుబడులకు అపార అవకాశాలున్నాయన్నారు. ఉత్తరాంధ్రలో క్రిటికల్ మినరల్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నామని, బీచ్ శాండ్ మినరల్స్ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రానికి ఆదాయం సమకూర్చడంతో పాటు 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యాన్ని సాకారం చేయబోతున్నామని, ఇందులో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి రావూరి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు బి.రాజశేఖర్, కోశాధికారి సుంకర అక్కయ్య నాయుడు, ఛాంబర్ ప్రతినిధులు పాల్గొన్నారు.



# నీటి హక్కుల పరిరక్షణపై ఇక పోరుబాటే

రెండేళ్లుగా కాంగ్రెస్ నిర్లక్ష్య వైఖరి
తెలంగాణ ప్రయోజనాలకు గండికొడుతున్న భాజపా
భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ ధ్వజం
ప్రజాఉద్యమ కార్యాచరణ, నిర్మాణంపై 19న సమీక్ష
తెలంగాణభవన్‌లో భారత రాష్ట్ర సమితి ఎల్పీ, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సంయుక్త సమావేశం

హైదరాబాద్: "రాష్ట్ర నీటి హక్కుల పరిరక్షణపై భారత రాష్ట్ర సమితి ప్రజా పోరాటానికి సన్నద్ధమవుతోంది. గోదావరి, కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ కొల్లగొడుతున్నా.. అడ్డుకునే విషయంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. మరోపక్క రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలకు భాజపా గండికొడుతోంది" అని భారత రాష్ట్ర సమితిఅధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్వజమెత్తారు. "ఇటువంటి సందర్భంలో తెలంగాణ ప్రజలు, రైతాంగ సాగునీటి హక్కులను కాపాడుకోవడానికి మరో ప్రజా ఉద్యమం తప్పదని భారత రాష్ట్ర సమితి భావిస్తోంది. ఇందులో భాగంగా తదుపరి నిర్మించబోయే తెలంగాణ ప్రజా ఉద్యమాలకు సంబంధించి పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో లోతుగా చర్చిస్తాం" అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర జల హక్కుల సాధన ఉద్యమం, నిర్మాణంపై చర్చించేందుకు కేసీఆర్ అధ్యక్షతన 19న మధ్యాహ్నం 2 గంటల నుంచి తెలంగాణభవన్‌లో భారత రాష్ట్ర సమితి ఎల్పీ, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సంయుక్త సమావేశాన్ని నిర్వహించనున్నారు. సమావేశంలో చర్చించనున్న అంశాలపై కేసీఆర్ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

**ప్రజలు, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు**

"కృష్ణా, గోదావరి జలాల విషయంలో.. పదేళ్ల భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లడంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై ప్రజల్లో చర్చ జరుగుతోంది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం 91 టీఎంసీలు కేటాయిస్తే..45 ఇస్తే చాలని కేంద్రం వద్ద రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రతిపాదించడమంటే.. రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలను తాకట్టు పెట్టడమే. ముఖ్యంగా పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ రైతాంగ ప్రయోజనాలు దెబ్బతింటున్న నేపథ్యంలో.. రాష్ట్రం నుంచి 8 మంది భాజపా ఎంపీలు ఉండి కూడా ఒక్కరూ మాట్లాడట్లేదు. రాష్ట్రానికి సాగునీటి విషయంలో కేంద్రంలోని భాజపా ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని కానీ.. కావేరి తదితర నదుల అనుసంధానం పేరుతో ఆంధ్ర రాష్ట్ర జలదోపిడీకి సహకరిస్తున్న భాజపా విధానాన్ని గానీ ఎదుర్కోవాలంటే.. తెలంగాణ సమాజానికి మరోసారి ప్రత్యక్ష పోరాటాలే శరణ్యం. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వమే గనక తిరిగి వచ్చి ఉంటే..

ఈ పాటికి పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి నీళ్లు అందేవి. పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ ప్రజలు.. రైతాంగ ప్రయోజనాలు కాపాడేవాళ్లం.

ఇప్పుడు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. పూర్తి నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించడం వల్ల.. ఆ ప్రాంత వాసులు తీవ్రంగా నష్టపోతున్నారు.

తెలంగాణ రైతాంగ ప్రయోజనాలను కాపాడే విషయంలో భారత రాష్ట్ర సమితి రాజీ పడబోదు. ఇలాంటి సమయంలో తెలంగాణ నదీ జలాల హక్కుల పరిరక్షణ, ఆంధ్ర జలదోపిడీ పైన పోరాడేందుకు ఒక ఉద్యమ స్వరూపానికి.. పార్టీ సంస్థాగత నిర్మాణ విషయాలు సహా పలు అంశాలను సంయుక్త సమావేశంలో చర్చిస్తాం. ప్రజా ఉద్యమాల నిర్మాణం, అనుసరించాల్సిన కార్యాచరణపై కీలక నిర్ణయాలుంటాయి"

అని కేసీఆర్ పేర్కొన్నారు.



# మోదీ సర్కారును గద్దె దించుతాం

సత్యం.. అహింసామార్గంలో వెళ్తాం
భాజపాకు ఈసీ దాసోహం
'ఓట్ చోర్... గద్దీ ఛోడ్' సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ

దిల్లీ: కేంద్రంలోని మోదీ-ఆర్ఎస్ఎస్ సర్కారును గద్దె దించేందుకు కాంగ్రెస్ కంకణం కట్టుకుందని, సత్యం.. అహింసామార్గంలోనే దానిని సాధిస్తామని లోక్‌సభలో విపక్షనేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. ఆదివారం ఇక్కడి రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ భారీస్థాయిలో నిర్వహించిన 'ఓట్‌చోర్... గద్దీ ఛోడ్' బహిరంగ సభనుద్దేశించి ఆయన ప్రసంగించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి భాజపా కోసం పనిచేస్తున్నారని ఆరోపించారు. అలాంటి సర్కారును తప్పించే శక్తి- సత్యం, అహింసలకు ఉన్నాయని చెప్పారు. బిహార్ ఎన్నికల సమయంలో మహిళల ఖాతాల్లోకి రూ.10,000 బదిలీచేసినా అధికార పార్టీపై ఈసీ ఎలాంటి చర్య తీసుకోలేదని, సత్యాసత్యాల మధ్య పోరులో పూర్తిగా భాజపాకు కొమ్ముకాస్తోందని ఆరోపించారు. ఎన్నికల కమిషనర్లపై ఎలాంటి చర్యలు తీసుకునే వీల్లేకుండా మోదీ సర్కారు చట్టం చేసినా.. వెనకటి తేదీతో అమల్లోకి వచ్చేలా తాము దీనిని మార్పుచేసి, వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందని చెప్పారు.

**ఓటుచోరీ అని అందరికీ తెలుసు** 'ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఓటు చోరీకి పాల్పడుతున్నారని దేశంలోని ప్రతి ఒక్కరికీ తెలుసు. ఓటరు జాబితాలోని అక్రమాలపై ఈసీని ప్రశ్నిస్తే జవాబు లేదు. ఓటుచోరీ అంటే రాజ్యాంగ దురాక్రమణ. భాజపా డీఎన్‌యేలోనే అది ఉంది. కాంగ్రెస్ కార్యకర్తల డీఎన్‌యేలో మాత్రం సత్యం ఉంది. భయపడాల్సిన అవసరం లేదు' అని రాహుల్ తెలిపారు. 'ప్రస్తుతం దేశంలో సత్యం.. సత్తా (అధికారం) మధ్య యుద్ధం జరుగుతోంది. అధికారం ఈరోజు ఉంటుంది.. రేపు పోతుంది. కానీ సత్యం శాశ్వతం. ఒకసారి అధికారం చేజారితే.. వారు ఎంత ధైర్యవంతులన్నది బయటపడుతుంది. నేను పార్లమెంటులో అమిత్‌షా గురించి మాట్లాడుతున్నప్పుడు మోదీ ముఖంలో విశ్వాసం కనిపించలేదు. త్వరలో నిజరూపం ప్రజలకు తెలిసిపోతుందన్న విషయం ఆయన గ్రహించారు. వీళ్లు ఓటుచోరీ చేయకపోయి ఉంటే ప్రజలు అయిదు నిమిషాల్లో అధికారం నుంచి తరిమేస్తారు' అని రాహుల్ పేర్కొన్నారు.

**దిల్లీలోని రామ్‌లీల మైదానంలో నిర్వహించిన సభకు హాజరైన కాంగ్రెస్ శ్రేణులు**మోసగాళ్లను గద్దె దింపాలి: ఖర్గే కాంగ్రెస్ అధ్యక్షుడు,

రాజ్యసభ విపక్షనేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ- రాహుల్ పోరాటానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. బెంగళూరులో తన కుమారుడికి పెద్ద శస్త్రచికిత్స జరిగినా తాను వెళ్లకుండా ఈ పోరు కోసం దిల్లీలోనే ఉన్నానని చెప్పారు. "కాంగ్రెస్ భావజాలం తప్పిస్తే ఆర్ఎస్ఎస్ ఆలోచనలు దేశాన్ని రక్షించలేవు. మోదీ నెమ్మదిగా రాజ్యాంగాన్ని అంతం చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఓటుచోరీచేసి అధికారంలో కూర్చున్న మోసగాళ్లను గద్దె దించాలి. రాజ్యాంగం ప్రసాదించిన ఓటుహక్కును కోల్పోతే పేదలు అన్యాయమైపోతారు. కాంగ్రెస్ ఎన్నిసార్లు ఓడిపోయినా దాని ఆలోచనా విధానం బతికే ఉంది. కానీ మోదీ ఒకసారి ఓడిపోతే ఆయన పేరు, ఆనవాళ్లు ఎక్కడా కనిపించవు" అని చెప్పారు. వ్యవస్థలను మోదీ, అమిత్‌షాలు ధ్వంసం చేస్తున్నారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ ఆరోపించారు.

